క్లుప్తంగా

కృష్ణా, గుంటూరు జిల్లాల హద్దుల గుర్తింపు



తోట్లవల్లూరు: ఐలూరు శివారు కనిగిరిలంకలో జిల్లా సరిహద్దులను శనివారం సర్వే అధికారులు ఏర్పాటు చేశారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన సర్వే అధికారుల బృందం ఆధ్వర్యంలో కనిగిరిలంక వద్ద రెండు జిల్లాల హద్దులను గుర్తించి నిర్ణయించారు. కృష్ణాజిల్లా సర్వే ఏడీ ఎం.జోషిలా, డీఐ శివరామప్రసాద్, మండల ఇన్‌చార్జి సర్వేయర్ రామకృష్ణ, వీఆర్‌ఓ శ్రీనివాస్, గ్రామ సర్వేయర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం గానామృతం

పామర్రు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు శ్రీనివాస కల్యాణం గానామృతం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో పూజలను చేసి, ఆలయ ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణ గానామృతం ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజ, మండపారాధన, కలశ స్థాపన అనంతరం స్వామికి విశేష పూజలను చేశారు. బొగ్గరపు రమాదేవి ఆధ్వర్యంలో శ్రీనివాస గానామృతం జరిపించారు. కల్యాణంలోని ఘట్టాలకు అనుగుణంగా ఆలయ అర్చకులు మాధవ్‌కుమార్ స్వామికి ఉపచారాలను అందజేశారు. నవీన్, శివకుమారి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ కార్యక్రమం చేశారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ముదినేపల్లి రూరల్: పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ సక్రమంగా అమలు చేయాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్లో ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విద్యార్థులు అనారోగ్యం పాలుకాకుండా చూడాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



మండవల్లి: భైరవపట్నంలో అగ్నిప్రమాద బాధితులకు ఆ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శనివారం సాయం అందజేశారు. 10 కుటుంబాలకు 240 కేజీల బియ్యం, రూ.6 వేల విలువ కలిగిన నిత్యావసర సరుకులు మండల విద్యాశాఖాధికారి రత్నసునాదం చేతులమీదుగా వారు అందజేశారు. భైరవపట్నం సర్పంచ్ నీలపాల రాధానాగేంద్ర, ప్రధానోపాధ్యాయులు నందూరి సుబ్రహ్మణ్యం, సముద్రుడు, వెంకటేశ్వరరావు, రవి, ఏ రవి, అగ్రహారం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రవి తదితరులు సరుకులు అందజేసిన వారిలో ఉన్నారు.

క్రీడలను కూడా ప్రోత్సహించాలి



గుడివాడ టౌన్: చదువుతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రోఫీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ పాల్గొన్నారు.

కాల్వలో పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుడివాడరూరల్: గుర్తు తెలియని ఓ వృద్ధుడు పట్టణంలోని బేతవోలు ఆదిత్య వాటర్ ప్లాంట్ దగ్గర ఉన్న మురుగు కాల్వలో పడి శనివారం మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు తెలుపు రంగు మాసిన గడ్డంతో, నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా కొత్త పింఛన్లు మంజూరుకు నోచుకోలేదు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నెలలుగా పింఛన్లు మంజూరు కాలేదు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.

అర్హత ఉన్నా ఆరు నెలలుగా అందని పింఛన్లు



పామర్రు సచివాలయం

పామర్రు: పామర్రు నియోజకవర్గంలో వందల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి నెలలు కాలంగా పింఛన్ అందకపోవడంతో కనీసం మందుల ఖర్చుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో రాజకీయ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ వలంటీర్ల ద్వారా గుర్తించి పింఛన్ల మంజూరు చేసి ఆదుకున్నారు. ప్రస్తుతం కొత్త పింఛన్ల మంజూరు చేయలేక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భర్త చనిపోయిన మహిళలకు అదే నెల్లో స్పౌజ్ కోటాలో గతంలో తాజాగా అనుమతి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భర్త చనిపోయి ఎటువంటి ఆదరువు లేకుండా ఉన్న మహిళలు పింఛన్‌కు నోచుకోకపోవడం తీవ్రమైన అన్యాయమని పలువురు వాపోతున్నారు.

రెండు వేలమంది అర్హులు

పామర్రు నియోజకవర్గంలో సుమారు రెండు వేల మంది అర్హులైన పింఛన్ దారులు ఉన్నారు. పామర్రు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, మొవ్వ, పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది పింఛన్ల మంజూరు కోసం తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆయా సచివాలయాలకు అర్హులు వేళ్తున్నా వెబ్ సైట్ ఓపెన్ కాలేదని చెప్పి వాళ్లను వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేక పోవడంతో అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిరంతరాయంగా వెబ్ సైట్ ఓపెన్‌లో ఉండేది. నేటి పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది.

పింఛన్ల తొలగించే కుట్ర

సార్వత్రిక ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్లకు సంబంధించిన వెబ్ సైట్ నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వెబ్ సైట్ ఓపెన్ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నెల రోజుల క్రితం పింఛన్లు తనిఖీలో భాగంగా పైలట్ ప్రాజెక్టులో జిల్లాలోని కొన్ని మండలాలను ఎంపిక చేసి 11 బృందాలుగా అధికారులను పంపించి పింఛన్లు పొందే వారి వివరాలను తనిఖీ చేశారు. కొత్త పింఛన్లు ఎలాగూ మంజూరు చేయలేదు. ఉన్న పాత పింఛన్లు తొలగించే కుట్ర చేస్తున్నారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సంబంధించి సామాజిక పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చి మంజూరు చేయాలని కోరుతున్నారు.

వివరాలు నమోదు చేసుకోవడం లేదు



నా భర్త చనిపోయి ఆరు నెలలు పైగా అయింది. ఇంత వరకు ఏ విధమైన వితంతువు పెన్షన్ రాలేదు. సచివాలయం వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేయమంటే ఆన్‌లైన్‌లో వెబ్ సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి నా వివరాలను నమోదు చేసుకుని, పింఛన్ మంజూరు చేయాలి.

– గాయత్రి, వితంతువు, పామర్రు

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు పంచాయతీ వద్దకు వెళ్తే నమోదుకు ఆన్‌లైన్ ప్రారంభం కాలేదని తిప్పి పంపించేశారు. ఈ విధంగా పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి వివరాలను నమోదు చేసి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– లక్ష్మి, వితంతువు, పామర్రు

వెబ్‌సైట్ ఓపెన్ కాగానే నమోదు చేస్తాం

ప్రస్తుతం పింఛన్ల నమోదుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదు. ప్రభుత్వం ఆన్‌లైన్ ఓపెన్ చేసిన వెంటనే అందరి వివరాలను నమోదు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తాం.

– జ్యోతి, ఎంపీడీఓ, పామర్రు

ఓటు హక్కు మన జన్మ హక్కు



తాడంకిలో 95 ఏళ్ల సీనియర్ ఓటర్ కామేశ్వరిని సత్కరిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



గుడివాడలో ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రమాణం చేస్తున్న అధికారులు, విద్యార్థులు

పమిడిముక్కల: ఓటు హక్కు మన జన్మ హక్కు అని తహసీల్దార్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్‌లో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవనారాయణ, వీఆర్వో శివప్రసాద్, కార్యదర్శి రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. తాడంకిలో జరిగిన సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, వీఆర్వో కోటేశ్వరరావులు 95 ఏళ్ల సీనియర్ సిటిజన్ కంభంపాటి కామేశ్వరిని సత్కరించారు.

గుడ్లవల్లేరు: మండలంలోని పోలింగ్ స్టేషన్లలో జాతీయ ఓటర్ల దినోత్సవానిన శనివారం ఘనంగా నిర్వహించారు. ఉలవలపూడిలోని సీనియర్ ఓటర్లను గ్రామ సర్పంచ్ పామర్తి అర్జున భాస్కరరావు సన్మానించారు. గుడ్లవల్లేరులో తహసీల్దార్ బి.లో కరాజు విద్యార్థులతో ఓటర్ల దినోత్సవ ర్యాలీని చేపట్టారు.

మొవ్వలో...

మొవ్వ: మొవ్వ తహసీల్దార్ కే మస్తాన్ పర్యవేక్షణలో మండలంలోని 21 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాల్లో 54 మంది సీనియర్ ఓటర్లను, 54మంది కొత్త ఓటర్లను శనివారం సత్కరించారు. స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్, వీఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ప్రతి భారత పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని గుడివాడ ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులు, ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంఈఓలు విజయ్, బాలాజీ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ చిననాగప్రసాదు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు పాలాభిషేకం

స్థానిక టిడ్కో కాలనీలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు దేవరపల్లి చిన్న, మహిళా మోర్చ అధ్యక్షురాలు బోనం గోపిక పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

పామర్రు: దేశ భవిష్యత్‌ను కాపాడేందుకు ప్రతిఒక్కరూ ఓటు విలువను తెలుసుకుని దానిని సార్థకత చేసే విధంగా ఓటు వేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే తిలకించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కృష్ణాజిల్లా ప్రాజక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీఓ జ్యోతి, ఎన్నికల డీటీ రజనీకాంత్, ఆర్‌ఐ రాము, హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరారాణి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పెదపారుపూడి: ప్రలోభాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. పెదపారుపూడిలోని 125 పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఓటర్ల దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల్లోని వృద్ధ ఓటర్లను సత్కరించారు. పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న తహసీల్దార్ సుభానీ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండవల్లిలో..

మండవల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మండల ప్రాథమిక పాఠశాల–1లో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. అతిథులుగా ఎంపీడీఓ కే రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్ విచ్చేశారు. ఈ సందర్భంగా నలుగురు సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, ఎన్డీఏ నాయకులు సత్తిబాబు, కొండలు, కార్యదర్శి రాధిక, వీఆర్వో వెంకటేష్, హెచ్‌ఎం ప్రతాప్ పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో పామర్రు విద్యార్థుల ప్రతిభ



పామర్రులో విజేతలతో హెచ్‌ఎం ఇందిరాణి



మొవ్వలో విజేతలతో ఉపాధ్యాయులు

పామర్రు: గ్రిగ్ మెమోరియల్ బాలుర సబ్ జోన్ ఆటల పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరాణి తెలిపారు. స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో పమిడిముక్కల గ్రామంలో జరిగిన ఈ పోటీల్లో అండర్–17 బాలుర విభాగం షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్స్‌గా, షార్టు పుట్‌లో రన్నర్స్‌గా నిలిచారన్నారు. అదేవిధంగా అండర్–14 విభాగం బాలుర సాఫ్ట్‌బాల్ విన్నర్స్‌గా, షటిల్ బ్యాడ్మింటన్ రన్నర్స్‌గా విజయం సాధించారన్నారు. వీరు త్వరలో జరగబోయే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు ఎం.రవికిషోర్, ఎం.మురళీలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మొవ్వ విద్యార్థుల ప్రతిభ

మొవ్వ: సబ్ జోన్ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల్లో స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పమిడిముక్కల జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగిన పోటీల్లో మొవ్వ విద్యార్థులు సీనియర్స్ బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నికాయిట్‌లో ప్రథమ స్థానం సాధించారు. జూనియర్స్ బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం త్రో బాల్, టెన్నికాయిట్‌లో ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శివకోటేశ్వరరావు శనివారం తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్స్ అప్పికట్ల రామారావు, మండలి మనోహరిని ఉప కార్యదర్శి మేకారాణి, పాఠశాల విద్యా కుటుంబం అభినందించారు.

రాజ్యాంగాన్ని అందుబాటులోకి తేవాలి

మండవల్లి: భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి అప్పారావు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక గ్రంథాలయం వద్ద రాజ్యాంగాన్ని గడపగడపకూ అందించాలని ఫ్లెక్సీ, బ్యానర్లు ప్రదర్శించి నినాదాలు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్ : అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలేనికి చెందిన కాగిత సుధాకరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడు పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో మనోజ్ రూ.5 వేలను అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక పామర్రు రోడ్‌లోని శ్రీ ద్వారకా సాయి సేవా సమితి గుడివాడ వారి ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. మన బలరాముడు మళ్లీ అయోధ్యలో కొలువై ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు సేవా సమితి అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి తెలిపారు. సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి నారాయణమూర్తి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గుడివాడ టౌన్: కార్మికుల సంక్షేమం కోసం తాను అన్ని విధాలా కృషి చేస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం మీకోసం మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఆర్‌కే కాంప్లెక్స్ వద్ద రోజువారి కూలీలతో ఆయన మాట్లాడారు. రోజువారి కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కల్పన కోసం సాయం చేయాలని కార్మికులు కోరారు. తాను అన్ని విధాలా కార్మికులకు అండగా ఉంటానని తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత




తోట్లవల్లూరులో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంఈఓ

తోట్లవల్లూరు: పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉపయోగకరమని మండల విద్యాశాకాధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం హెచ్‌ఎంలకు అందజేశారు. తోట్లవల్లూరు, పెనమకూరు, వల్లూరుపాలెం, దేవరపల్లి జెడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ వెంకటేశ్వరరావు ఒక్కొక్కరికి ఐదు పుస్తకాల చొప్పున అందజేశారు. ఎంఈఓ–2 సురేష్, డెమొక్రటిక్ పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: స్థానిక ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. మెటీరియల్‌ను 1991–92లో ఈ హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థుల సాయంతో అందిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు ఎల్.నరేంద్ర, ఎల్.వి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు, శేషుకుమార్ తెలిపారు.

సైన్స్‌ఫెయిర్‌లో ఫణిరాజమోహన్ ప్రతిభ



పాండిచ్చేరిలో జ్ఞాపిక అందుకుంటున్న ఫణిరాజమోహన్

తోట్లవల్లూరు: పాండిచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్–2025లో తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం టి. ఫణిరాజమోహన్ ప్రతిభను కనబరిచారు. టీచర్స్ విభాగంలో ఆయన రూపొందించిన మేథమేటికల్ టీచింగ్ ఎయిడ్స్‌కు ద్వితీయ స్థానం లభించింది. పాండిచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం నించి ఫణిరాజమోహన్ జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని శనివారం అందుకున్నారు. ఆయనకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

28న మెగా జాబ్ మేళా

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఈ నెల 28న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ మేళాలో పాల్గొనదలచిన యువత డిగ్రీ 50 శాతం పైబడి మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 25 ఏళ్లలోపు వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారు ఆంధ్ర, తెలంగాణాలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఆధార్‌కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.


సంక్షిప్తం

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



గుడివాడ టౌన్: రక్తదానం చేసేందుకు యువత అన్నివేళలా సిద్ధంగా ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వారి ఆరోగ్యానికి మంచిదన్నారు. అదేవిధంగా రక్తం అవసరమై సకాలంలో అందక ప్రాణాలు కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారన్నారు. అట్టివారికి రక్తదానం ప్రాణదానంతో సమాన మవుతుందన్నారు. మొత్తం 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకరనాథ్, వైస్ ప్రిన్సిపాల్ బేగం, అధ్యాపకులు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులైన కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఎంపీ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే కామినేని

మండవల్లి: భైరవపట్నంలో అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎంపీ మహేష్‌కుమార్ ఒక్కొక్కరూ రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.శనివారం వారు ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. సత్యసాయి సేవా సంస్థ బాధిత కుటుంబాలకు బియ్యం నిల్వ చేసే స్టీల్ డబ్బాలు, నిత్యావసర సరుకులు ఎమ్మెల్యే, ఎంపీ చేతులమీదుగా అందజేశారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ సుమారు 20 కుటుంబాల ఇళ్లు అగ్నికి ఆహుతికావడం దారుణమన్నారు. శ్యామల ట్రేడర్స్ నిర్వాహకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా బాబీ బాధితులకు రూ. 50 వేలు అందించారు. చాపరాల బలరాముడు మనవరాలు లాస్య రూ.10 వేలు, జి.సుధాకర్ కూరగాయలు అందజేశారు.

కంకిపాడు రోడ్డును వెంటనే బాగు చేయాలి

గుడివాడ టౌన్: అధ్వానంగా మారిన గుడివాడ–విజయవాడ (కంకిపాడు రోడ్డు) రోడ్డును తక్షణమే బాగు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం భవిష్యత్ భద్రతాదళం ఆధ్వర్యంలో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రతాదళం సభ్యులు ఎండీ తెహర్‌బాషా, పూర్ణచంద్రరావు, ఎం. దుర్గారావు, మస్తాన్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మండవల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు ఉపయోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని ఉనికిలి, పులపర్రులో శనివారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 22 గర్భవాత పశువులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఏడీ వరప్రసాద్, చింతపాడు, కానుకొల్లు డాక్టర్లు సూర్యకుమారి, రామకృష్ణ మాట్లాడారు. పశువులకు అందించే టీకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్లు రామకృష్ణ, సూర్యకుమారి పాల్గొన్నారు.